క్లుప్తంగా

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



బాల్కొండ: దళిత్ శక్తి ప్రోగ్రాం వ్యవస్థాపకుడు విశారద మహరాజన్ గతేడాది మార్చిలో ప్రారంభించిన 10వేల కిలోమీటర్ల పాదయాత్ర ఈ నెల 30తో పూర్తవుతుందని డీఎస్పీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈమేరకు సరూర్ నగర్‌లో నిర్వహించే ముగింపు సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను బుధవారం వారు మండల కేంద్రంలో ఆవిష్కరించారు. నాయకులు దిలిప్, సతీష్, నిశాంత్, రంజిత్, రాజెందర్, రాజాశేఖర్, నరెందర్ రుచిత్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోండి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో అక్రమంగా ఇంటి నెంబర్లు కేటాయిస్తున్నా, ప్రభుత్వ స్థలాలు కబ్జా అవుతున్నా జిల్లా పాలన అధికారి చోద్యం చూస్తున్నారని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, జిల్లా ప్రధానకార్యదర్శి జీవీ నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇరిగేషన్ స్థలంలో బార్ ఏర్పాటు చేసిన అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైన జిల్లా పాలన అధికారి స్పందించి ఆర్మూర్ మున్సిపల్‌లో జరుగుతున్న అవీనితి అక్రమాలపై చర్యలు తీసుకోవాలన్నారు.

మేడే స్ఫూర్తితో పోరాడాలి



బోధన్: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే స్ఫూర్తితో కనీస వేతనాలు పెంపుదల, సామాజిక భద్రత, పనిగంటల తగ్గింపు కోసం పోరాడాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ కార్మికులకు పిలుపు నిచ్చారు. పట్టణంలో బుధవారం ఆయన మేడే వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మేడే ఉత్సవాలను అన్ని రంగాల కార్మికులు ఘనంగా జరుపుకోవాలని తెలిపారు. కార్మికులు మక్కయ్య, జ్ఞానేశ్వర్, గంగారాం, నారాయణ, రాజు, సత్యనారాయణ, సురేష్, మధు, పోశెట్టి,సాయిలు పాల్గొన్నారు.

సాధు సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి



బాల్కొండ: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయ ప్రాంగాణంలో జిల్లా సాధు పరిషత్ ఆధ్వర్యంలో నేటి నుంచి నిర్వహించే సాధు సమ్మేళనంను విజయవంతం చేయాలని జిల్లా సాధుపరిషత్ అధ్యక్షుడు శివానంద భారతి స్వామీ పిలుపు నిచ్చారు. బుధవారం సమ్మేళనం ఏర్పాట్లను నిర్వహకులతో కలిసి ఆయన పరిశీలించారు. మూడు రోజులపాటు సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజు భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు.

హద్దురాళ్ల ఏర్పాటు అడ్డగింత



బాల్కొండ: మండల కేంద్రంలో 1333 సర్వే నంబరులో గల ప్రభుత్వ భూమికి సరిహద్దుల ఏర్పాటు కోసం హద్దురాళ్లను బుధవారం జీపీ ఆధ్వర్యంలో ఈవో రజనీకాంత్‌రెడ్డి పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు. కానీ కొందరు అడ్డుకోవడంతో మధ్యలోనే వదిలేసి వెళ్లారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఆయన తెలిపారు.

కంటివెలుగు శిబిరాల ప్రారంభం



రుద్రూర్/మాక్లూర్/నందిపేట్: నందిపేట్ మండలంలోని తల్వేద గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ప్రారంభించారు. అలాగే కోటగిరి మండలం ఎత్తోండ గ్రామంలో బుధవారం కంటివెలుగు శిబిరాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. మాక్లూర్ మండలంలోని మదన్‌పల్లిలో సర్పంచ్ ఎనుగంటి శంకర్‌గౌడ్ కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు.

అవార్డు గ్రహీతకు అభినందన

బోధన్: పట్టణానికి చెందిన గోసంగీ సంఘం జిల్లా అధ్యక్షుడు గ్రంధం రాజేష్‌కు అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో రాష్ట్ర ప్రభుత్వం దళిత రత్న అవార్డును ప్రదానం చేసింది. ఈసందర్భంగా బుధవారం ఎమ్మెల్యే షకీల్ ఆయనను సన్మానించి అభినందించారు.

మురికికూపాలుగా ఓపెన్‌ప్లాట్లు

- డ్రెయినేజీలు లేకపోవడంతో ఖాళీ స్థలాల్లో నిలిచిన మురికినీరు
- ఇబ్బందుల్లో శ్రీనివాస్‌నగర్ కాలనీవాసులు



శ్రీనివాస్ నగర్ కాలనీలోని ఖాళీ స్థలంలో నిలిచిన మురికి నీరు

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోగల శ్రీనివాస్ నగర్ కాలనీలో ఓపెన్‌ప్లాట్లు మురికికూపాలుగా మారుతున్నాయి. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో ఇటీవల నూతనంగా నిర్మించిన ఇళ్లకు మురికి కాలువల నిర్మాణాలు లేకపోవడంతో మురికి నీరు రోడ్లపై నుంచి ఓపెన్ ప్లాట్లలో చేరి కుంటలను తలపిస్తున్నాయి. దీంతో పందులు, దోమలు స్వైర విహారం చేయడంతో కాలనీవాసులు అనారోగ్యాల బారిన పడుతున్నారు. అలాగే పరిసరాలు అధ్వానంగా మారడంతో స్థానికులు ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు.

పట్టించుకోని అధికారులు..

కాలనీలో నెలకొన్న సమస్యను పరిష్కరించాలని అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు. గత మూడు నెలలుగా కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌కు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు. అధికారుల నిర్లక్ష్య వైఖరిపై కాలనీవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి, కాలనీలో మురికి కాలువల నిర్మాణాలు చేపట్టి, సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సమస్యను పరిష్కరించాలి..



మున్సిపల్ అధికారులు ప న్నుల వసూలులో చూపిస్తున్న శ్రద్ధ కాలనీల్లో సమస్యల పరిష్కారంపై చూపడం లేదు. కాలనీలో మురికి నీరు నిలువ ఉండి కుంటలను తలిపిస్తూండటంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాము. ఇప్పటికైనా స్పందించి మా సమస్యను పరిష్కరించాలి. – జంగం అశోక్, శ్రీనివాసనగర్, ఆర్మూర్

ఎవరూ పట్టించుకోవడం లేదు..



ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో ఎన్నిసార్లు మా కాలనీ సమస్యను విన్నవిస్తూ వినతిపత్రం సమర్పించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. దుర్గంధభరితమైన పరిసరాల్లో కాలనీవాసులు అనారోగ్యాల పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– ప్రభాకర్, శ్రీనివాస నగర్ కాలనీ, ఆర్మూర్

అధికారుల గైర్హాజరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం





వర్ని మండల సభకు అధికారులు రాక ఖాళీగా ఉన్న కుర్చీలు.. ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సర్పంచులు

వర్ని: మండల సభకు అధికారుల గైర్హాజరు కావడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్ని మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ మేక శ్రీలక్ష్మీ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి విద్యుత్‌శాఖ అధికారులతో పాటు ఇతర శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. దీంతో సర్పంచ్‌లు రాజు, నాని బాబు, వెంకటేష్, మండల ఉపాధ్యక్షులు బాలరాజులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని సమావేశంలో తీర్మానం చేశారు. సమస్యలను అధికారులు దృష్టికి ఎన్నిసార్లు తీసుకువచ్చినా పరిష్కరించడంలో శ్రద్ధ వహించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో మూడు వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు ఏఈ నగేష్‌రెడ్డి తెలిపారు. బోధన్ నుంచి హైదరాబాద్‌కుసూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సులను వేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు తెలిపారు. జెడ్పీటీసీ హరిదాసు, ఎంపీడీవో బషీరుద్దీన్ పాల్గొన్నారు.

బీసీలు రాజకీయంగా ఎదగాలి



సభలో అభివాదం చేస్తున్న బీసీ నాయకులు

బాల్కొండ: బీసీలు రాజకీయంగా ఎదగాలని బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మేక పోతుల నరేందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం 'చలో బాల్కొండ పేరిట నిర్వహించిన బీసీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. జనాభాలో దామాషా పద్ధతిలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీల జనాభా అత్యధికంగా ఉన్నప్పటికీ రాజకీయంగా చిన్నచూపు చూడటం తగదన్నారు. జిల్లా అధ్యక్షుడు అశోక్‌గౌడ్, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విఠోభా, ప్రధాన కార్యదర్శి భిక్షపతి, ఉపాధ్యక్షుడు బొబ్బిలి నర్సయ్య పాల్గొన్నారు.

బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

బోధన్: బోధన్ ఎన్డీఎస్ఎల్ ఫ్యాక్టరీ లేఆఫ్ నాటి నుంచి నెలసరి బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని కార్మిక నాయకుడు నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. పట్టణంలోని శక్కర్‌నగర్ షుగర్ ఫ్యాక్టరీ ప్రధాన గేట్ ఎదుట బుధవారం కార్మికులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఫ్యాక్టరీ మూతపడటంతో ఉపాధి కోల్పోయిన కార్మికులు ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా.. ఫ్యాక్టరీ యాజమాన్యం, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఫ్యాక్టరీ లోపల స్క్రాప్‌ను గుట్టుగా రాత్రివేళల్లో తరలించేందుకు యాజమాన్యం ప్రయత్నాలు చేస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. కార్మికుల ఆర్థిక పరమైన సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఇక్కడ నుంచి ఏ స్క్రాఫ్‌ను తీసుకెళ్లనివ్వబోమని వెల్లడించారు. నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



ఆర్‌ఐకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వేల్పూర్: సొంతస్థలం ఉన్న పేదలు ఇల్లు నిర్మించుకోడానికి నిధులు మంజూరు చేయాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు వేల్పూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం ఆర్‌ఐకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దేవరాం మాట్లాడుతూ.. పేదల ఇంటి నిర్మాణానికి రూ. 10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. ఆర్మూర్ సబ్‌డివిజన్ కార్యదర్శి కిషన్, నాయులు రాజన్న, రమేశ్, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, పేదలు పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలి



ధర్నా నిర్వహిస్తున్న పీవోడబ్ల్యూ ప్రతినిధులు

బోధన్: అర్హులైన పేదలందరికీ కొత్త రేషన్ కార్డులు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, సొంత స్థలాలు ఉన్నవారికి ఇల్లు కట్టుకునేందుకు రూ. 10లక్షలు ఇవ్వాలని పీవోడబ్ల్యూ (ప్రగతిశీల మహిళ సంఘం) సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం వారు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. పట్టణ అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఒక్కరికి 5కిలోల చొప్పున సన్నబియ్యం, 12 రకాల నిత్యావసర సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సభ్యులు బీపాషా బేగం, లక్ష్మి, సుచరణ, కళావతి, దేవుబాయి పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన





దేగాంలో తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు.. మాక్లూర్ మండలంలో..



రుద్రూర్ మండలంలో..



బోదేపల్లిలో..



మోర్తాడ్‌లో..



కమ్మర్‌పల్లిలో..

పెర్కిట్(ఆర్మూర్)/మాక్లూర్/రుద్రూర్/బాల్కొండ/మోర్తాడ్/కమ్మర్‌పల్లి/వేల్పూర్/బోధన్‌రూరల్/భీమ్‌గల్/నవీపేట: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో గత రెండు రోజులుగా అకాల వర్షం, పలు చోట్ల వడగండ్ల వాన కురిసింది. దీంతో ఆయా నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయి. అలాగే కల్లాల వద్ద, కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం సైతం తడిచిపోయింది. ఈసందర్భంగా దెబ్బతిన్న పంటపొలాలను బుధవారం ఆయా మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నువ్వు, వరి, సజ్జ పంటలు దెబ్బతిన్నాయన్నారు. పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు అధికారులు తెలిపారు. ఆర్మూర్‌లో మండలం దేగాం, ఆలూర్ గ్రామాల్లో నేలకొరిగిన నువ్వు పంటను పరిశీలించారు. మూడు రోజుల పాటు వర్ష సూచన ఉన్నందున రైతులు ధాన్యంపై టార్పలిన్ కవర్లను కప్పి ఉంచాలని సూచించారు. మాక్లూర్ మండలంలో 650 ఎకరాల్లో వరి ధాన్యం నేలరాలినట్లు అధికారులు ధృవీకరించారు. కమ్మర్‌పల్లి మండలంలోని నాగాపూర్‌లో 10ఎకరాలు, కమ్మర్‌పల్లిలో 6ఎకరాల్లో మామిడి తోటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు పేర్కొన్నారు.

రైతులను ఆదుకోవాలి..

బోధన్ మండలంలోని ఏరాజ్‌పల్లి గ్రామంలో అకాల వర్షాలతో తడిసిన రైతుల ధాన్యం. నెలకొరిగిన పంటలను బీజేపీ నాయకులు పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ నాయకుడు మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. భీమ్‌గల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బీజేపీ నాయకుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఎలాంటి తరుగు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నవీపేటలో తడిసిన ధాన్యాన్ని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా, అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం నేతలు పరిశీలించిచారు. తడిసిన ధాన్యాన్ని తరుగు లేకుండా కొనుగోలు చేయాలని, ఎకరానికి రూ. 50వేల నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.



భీమ్‌గల్‌లో..



ఏరాజ్‌పల్లిలో..



కోమన్‌పల్లిలో..

ఒంటికాలిపై నిల్చొని వీవోఏల నిరసన



రుద్రూర్‌లో నిరసన తెలుపుతున్న వీవోఏలు



ముప్కాల్‌లో..



కమ్మర్‌పల్లిలో..

మాక్లూర్/రుద్రూర్/బాల్కొండ/కమ్మర్‌పల్లి: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీవోఏలు ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాలో మూడురోజులుగా సమ్మె నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా బుధవారం వారు ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను స్థానిక తహసీల్దార్లకు అందజేశారు. పలువురు వీవోఏలు మాట్లాడుతూ.. నిరసన కార్యక్రమాలు చేపట్టి మూడు రోజులు కావస్తోందని, ప్రభుత్వం స్పందించకపోతే జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని వారు వెల్లడించారు.

వంతెన నిర్మాణ పనులు ప్రారంభం



వంతెన నిర్మాణం కోసం తవ్వుతున్న గుంతలు

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్, సోన్‌పేట్ గ్రామాల మధ్య కాకతీయ కాలువపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు ఎట్టకేలాకు ప్రారంభమయ్యాయి. వంతెన నిర్మాణం కోసం కాలువలో ఫుట్టింగ్‌లు వేయుటకు కావల్సిన తవ్వకాలు చేపడుతున్నారు. పనులు చేపడుతున్నప్పుడు వంతెన వద్ద ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టడం లేదని రెండు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సూచిక బోర్డులు, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

టీఎన్జీవో భీమ్‌గల్ తాలుకా..



భీమ్‌గల్: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం టీఎన్జీవో భీమ్‌గల్ తాలూకా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా ఏపీఎం కుంట శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడిగా వార్డెన్ లక్ష్మణ్ ఎన్నికయ్యారు. జిల్లా చైర్మన్ అకుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. త్వరలో భీమ్‌గల్ యూనిట్ టీఎన్జీవో నూతన భవన నిర్మాణానికి మంత్రి ప్రశాంత్‌రెడ్డిచే శంకుస్థాపన చేయించటానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడు అలుక కిషాన్, కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

- మాతృమూర్తులను ఆదరించాలి



బోధన్: మానవాళి సృష్టికి మూలమైన మాతృమూర్తులను ఆదరించాలని కామారెడ్డి జిల్లా బిచ్కుంద మఠాధిపతి సోమలింగ్ శివాచార్య మహారాజ్ పేర్కొన్నారు. ఆధ్యాత్మిక దివ్య జ్ఞానాన్ని భావితరానికి అందించి విద్యావంతులు, సంస్కారవంతులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో అఖండ శివనామసప్తాహం బుధవారం ఆరోరోజు కొనసాగింది. ఉదయం నుంచి రాత్రి వరకు శివకీర్తనలు, భజనలు, పరమ రహస్య గ్రంథ పారాయణం, అన్నదానం కార్యక్రమాలు కొనసాగించారు. వీరశైవ లింగాయత్ సమాజ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రేషన్ డీలర్ మృతి



రాజేశ్వర్ (ఫైల్)

మాక్లూర్: మండలంలోని చిక్లి గ్రామానికి చెందిన రేషన్ డీలర్ రాజేశ్వర్ మంగళవారం (45) గుండెపోటు వచ్చి మృతి చెందాడు. రాజేశ్వర్ సాయంత్రం తన పంట పొలాన్ని హర్వేస్టర్‌తో కోయించి, ఇంటికి వచ్చాడు. భోజనం చేసిన అనంతరం ఛాతిలో నొప్పి వస్తుందని తెలపడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించగా.. అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం జరిగిన అత్యక్రియల్లో మండల రేషన్ డీలర్లు పాల్గొని, సంతాపం తెలిపారు.

తడిసిన ధాన్యాన్ని నేను కొనుగోలు చేస్తా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షకీల్

- బోధన్ ఎమ్మెల్యే షకీల్

ఎడపల్లి(బోధన్): బోధన్ నియోజకవర్గంలో తడిసిన ధాన్యాన్ని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో తిరస్కరించిన ధాన్యాన్ని, నేను నా సొంత ఖర్చులతో రైస్ మిల్లుల కోసం తీసుకోవాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యే షకీల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గ ప్లీనరీ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అకాల వర్షాలకు వడగండ్ల వానకు నష్టపోయిన ధాన్యాన్ని ప్రభుత్వం తీసుకోకుంటే అట్టి ధాన్యాన్ని తన దగ్గరకు తీసుకురావాలని, రైతులకు సూచించారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకునే విధంగా కృషి చేస్తానన్నారు. ప్లీనరీ సమావేశంలో పలు తీర్మానాలను ప్రవేశ పెట్టారు. నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ విఠల్ రావు, వైస్ చైర్‌పర్సన్ రజిత యాదవ్, ఎంపీపీ శ్రీనివాస్, నాయకులు రాజేశ్వర్, శ్రీనివాస్, ఎంపీపీ బుద్ధ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.